జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయం



ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐజేయూ) పని చేస్తుందని మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ఏఎస్‌ రాజు కమ్యూనిటీ హాల్‌లో వర్కింగ్‌ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులు స్వీయ నియంత్రణతో విధి నిర్వహణలో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారు చేసి మీడియా అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస్‌ రెడ్డికి అందజేస్తామని తెలిపారు. ఆయన నుంచి ప్రభుత్వానికి అందజేసేందుకు రాష్ట్ర యూనియన్‌ నాయకులు కృషి చేస్తారన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్‌ అధ్యక్షుడు కరీం, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రంజిత్‌, నాయకులు నవీన్‌రెడ్డి, తిరుపతి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్‌ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కాలనీ అసోసియేషన్‌లు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌ కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పి. రత్నప్రసాద్‌, ఉపాధ్యక్షులు ఎం.బాబూరావు, జనరల్‌ సెక్రటరీ ఎం.యాదిరెడ్డి, జాయింట్‌ సెక్రటరీ సీహెచ్‌. వెంకట్రామరెడ్డి, ట్రెజరర్‌ టి. మదన్‌మోహన్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ వి.వెంకట్‌రావు, జోనల్‌ ఎగ్జిక్యూటివ్‌లు కేఎస్‌ఆర్‌ చౌదరి, బసవ లింగయ్య, బి.శంకర్‌రావు, ప్రకాష్‌ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్మల్‌ సదన జ్యోతి మందిర్‌ వార్షికోత్సవం



యోగాసనాలు చేయిస్తున్న గురూజీ నరేంద్ర

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మాధవరం కాలనీలోని నిర్మల్‌ సదన జ్యోతి మందిర్‌లో ఆదివారం 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు బ్రాంచ్‌ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు, కో ఆర్డినేటర్‌ మందపాటి చంద్రశేఖర్‌ తెలిపారు. పూజ్య యోగ శ్రీ శాంతి యోగ గురూజీ నరేంద్ర ఆధ్వర్యంలో పెద్దలకు, యువకులకు, చిన్నారులకు యోగా కార్యక్రమం నిర్వహించారు.

1న హెచ్‌సీయూ స్నాతకోత్సవం

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవాన్ని అక్టోబర్‌ 1న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ భాసుత్కర్‌ జగదీశ్వర్‌రావు పర్యవేక్షణలో చాన్స్‌లర్‌ జస్టిస్‌ ఎల్‌ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా ఏఐసీటీఈ చైర్మన్‌ ప్రొఫెసర్‌ టీజీ సీతారాం, ఆత్మీయ అతిథిగా రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ హాజరుకానున్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు



పటేల్‌కుంట పార్కు వద్ద వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు, నిర్వాహకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్‌–1 కమిటీ హాల్‌లో దీన్‌ దయాళ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకటేశం గౌడ్‌, ఆదిత్య నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ సురభి రమేష్‌రావు ఆధ్వర్యంలో మేడిస్యూర్‌ హాస్పిటల్‌ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్‌ సెక్రటరీ సంపత్‌ రెడ్డి, కుమార చారి, రఘు, నాయకులు అల్లూరి సీతారామరాజు, అరుణ్‌ కుమార్‌, అంజన్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ సమతానగర్‌ కాలనీలో..

బోల్డ్‌బోయిన్‌పల్లి: ఆర్‌బీఐ సమతానగర్‌ కాలనీలో డెంటిస్టు డాక్టర్‌ అనూష, ఇండియన్‌ రెడ్‌క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మంది కాలనీ వాసులకు దంత, బీపీ, షుగర్‌, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు లోహిదాస్‌, కార్యదర్శి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మధుసూదన్‌, ఉపాధ్యక్షులు రాంచందర్‌ రావు, రాధాకృష్ణ, నితిన్‌, ఝాన్సీ, సదాలక్ష్మి, సుధా, ప్రమీల, మీనాక్షి పాల్గొన్నారు.

పటేల్‌కుంటలో..

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌ కాలనీ డివిజన్‌లోని పటేల్‌ కుంట పార్కు దగ్గర ఫస్ట్‌ కేర్‌ ఫార్మసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్‌, బీఎంఐ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫస్ట్‌ కేర్‌ ఫార్మసీ మేనేజర్‌ శేఖర్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు తగిన మందులు వాడాలని, పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. ఇన్‌చార్జి సురేష్‌, సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఆల్విన్‌ కాలనీలోని ఫస్ట్‌ కేర్‌ ఫార్మసీలో బీఎంఐ పరీక్షలు ప్రతి రోజు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8125033352 నెంబర్లో సంప్రదించాలన్నారు.

గాయత్రి నగర్‌లో..

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రి నగర్‌ వినాయక మండపం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో బీపీ, కొలెస్ట్రాల్‌, బ్లడ్‌ షుగర్‌ టెస్ట్‌, దంత, నేత్ర, చర్మ సమస్యలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాయత్రి నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.సంజీవ్‌, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వెంకటేశం గౌడ్‌, సురభి రమేష్‌రావు తదితరులు



ఆర్‌బీఐ సమతానగర్‌ కాలనీ వైద్య శిబిరంలో పాల్గొన్న నాయకులు, వైద్యులు తదితరులు

బాబోయ్‌ టౌన్‌ ప్లానింగ్‌ సేవలు!

- నిజాంపేట్‌ మున్సిపాలిటీలో ఐదారు నెలలుగా ఖాళీగానే ఏసీపీ పోస్టు
- మరోవైపు ఇన్‌చార్జి టీపీఎస్‌ అధికారి
- అదనపు బాధ్యతలతో అంతంత మాత్రంగానే సేవలు
- ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టని అధికారులు



నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయం

నిజాంపేట్‌: నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో టౌన్‌ ప్లానింగ్‌ విభాగం ఉందా..? లేదా..? అనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులోని ఏసీపీ పోస్టు ఐదారు నెలలుగా ఖాళీగానే ఉన్నది. దీనికితోడూ జనగామ మున్సిపాలిటీలో టీపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతికి ప్రభుత్వం నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ టీపీఎస్‌ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆమెకు రెండు ప్రాంతాల్లో విధులు ఉండడంతో పూర్తిస్థాయిలో ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రశాంతి నెల రోజుల పాటు సెలవులో ఉండడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. టౌన్‌ ప్లానింగ్‌ విభాగానికి పూర్తి స్థాయిలో అధికారి లేకపోవడంతో అటు అధికారులకు, ఇటు కిందిస్థాయి సిబ్బందికి సైతం అవస్థలు తప్పడం లేదు.

జనగామకు ఎక్కువ.. నిజాంపేట్‌కు తక్కువ..

ఏడాదిన్నరగా నిజాంపేట్‌ ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా ప్రశాంతి విధులు నిర్వర్తిస్తుంది. మొదట్లో వారానికి మూడు రోజులు జనగామ, మరో మూడు రోజులు నిజాంపేట్‌లో విధులు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం జనగామకే ఎక్కువ పరిమితమై, నిజాంపేట్‌కు వారానికి కేవలం ఒక్క రోజే వస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో ఏసీపీ అధికారి ఉన్నప్పుడు టీపీఎస్‌ లేకపోయిన తమ పనులు , గత ఆరు నెలల నుంచి సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారి పని ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్‌ఓసీల జారీతో పాటు ఫుట్‌పాత్‌ ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లాంటి అనేక సమస్యలు ఉన్నాయి. అయితే పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసే అధికారి లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఆఫీస్‌లో ఉండరు.. ఫోన్‌ లిఫ్ట్‌ చేయరు..

రెండు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న టీపీఎస్‌ ప్రశాంతి ఎప్పుడూ ఆఫీసులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొన్నది. కనీసం కాల్‌ చేసి తెలుసుకుందామంటే ఫోన్‌ ఎత్తడం లేదని, కింది స్థాయి సిబ్బందిని అడిగితే వారికి పూర్తి స్థాయిలో సమాచారం ఉండదని బాధితులు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా ఫుట్‌ పాత్‌ల ఆక్రమణే..

నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో జనాభాతో ట్రాఫిక్‌ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రోడ్ల వెంట ప్రగతినగర్‌, బాచుపల్లి, నిజాంపేట్‌లో ఎక్కడ చూసినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోయాయి. వీటిని నియంత్రించాల్సిన టౌన్‌ ప్లానింగ్‌ విభాగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల వెంట ఉండే చిరు వ్యాపారులకు ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తామని అధికారులు హామీనిచ్చారు. కానీ ఇప్పటి వరకు అది అమలుకు నోచుకోలేదు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు..



హెచ్‌ఎండీఏ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో మున్సిపల్‌ అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. అనుమతుల మంజూరులో వారి పాత్ర కీలకం . పలు ఆక్రమణాలపై తాము ఫిర్యాదు చేస్తే టీపీఎస్‌ ప్రశాంతి స్పందించడం లేదు. పైగా హెచ్‌ఎండీఏ అనుమతులు ఉన్నాయని చెప్పడం ఎంతవరకు సమంజసం.అంబీరు చెరువులో చిరు వ్యాపారులను తొలగించారు. వారికి ప్రత్యామ్నాయం కల్పిస్తామన్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్‌ టౌన్‌ ప్లానింగ్‌ విభాగాన్ని ఇకనైనా గాడిన పెడతారని ఆశిస్తున్నాం.

–సుధీర్‌ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌ ప్రగతినగర్‌

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నిజాంపేట్‌ టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో ఏసీపీ భర్తీ విషయమై ఇప్పటికే డైరెక్టర్‌ టౌన్‌ ప్లానింగ్‌కు లెటర్‌ పెట్టాం. అదేవిధంగా సీడీఎంఏకు సైతం కాపీ పంపించాము. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి టీపీఎస్‌ ప్రశాంతి నెల రోజుల పాటు సెలవులో ఉన్నారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి వస్తే పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటాను.

–సౌజన్య, నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌

హన్మకొండకు ప్రతి సోమవారం ఆర్టీసీ ఇంద్ర బస్సు

మూసాపేట: హన్మకొండకు ప్రతి సోమవారం ఉదయం 5 గంటల నుంచి గచ్చిబౌలి నుంచి ఆర్‌టీసీ బస్సు ప్రాంభించినట్లు డిపో మేనేజర్‌ హరి ఆదివారం తెలిపారు. ఇంద్ర బస్సు 8277 సర్వీస్‌ నెంబర్‌ గచ్చిబౌలి నుంచి 10:30 గంటలకు హన్మకొండకు వెళ్తుందని తెలిపారు. ఉప్పల్‌, జేబీఎస్‌, కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, హైటెక్‌ సిటీ మీదుగా గచ్చిబౌలికి చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్‌ జిల్లా వాసులు, కూకట్‌పల్లి, గచ్చిబౌలిలో నివాసం ఉండే ఆ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోలని కోరారు.

అంతర్జాతీయ చెవిటి అవగాహన వారోత్సవాలు

చందానగర్‌ : చందనగర్‌లోని న్యూ గుడ్‌ షెఫర్డ్స్‌ చెవిటి మూగ పాఠశాలలో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చెవిటి అవగాహన వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వినికిడి లోపం పుట్టుకతో లేదా ఎప్పుడైనా రావచ్చన్నారు. పరీక్షలో కనీసం 25 డేసీబుల్స్‌ వినకుంటే వినికిడి లోపంగా నిర్ధారిస్తారన్నారు. ఐక్యరాజ్యసమితి వారు ఈ లాంగ్వేజికి గుర్తింపు తెచ్చేందుకు ఈ వారాన్ని సైన్‌ లాంగ్వేజేస్‌ వారోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. బధిరులు ఉపయోగించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం చందానగర్‌లోని స్మిత దంత వైద్యశాల డాక్టర్‌ శ్రీధర్‌ రెడ్డి విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్టులు, బ్రష్‌లు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపాల్‌ మెర్సీ, ఉపాధ్యాయురాలు శోభ, ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు నందూరి వెంకటేశ్వరరాజు, అమ్మయ్య చౌదరి, శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారతంలో జీర్ణ సంబంధిత రుగ్మతలు అధికం

మాదాపూర్‌: దక్షిణ భారతదేశంలో రోజురోజుకూ జీర్ణ సంబంధిత రుగ్మతలు గణనీయంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్‌ గ్రూప్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పవన్‌ గోరుకంటి అన్నారు. మాదాపూర్‌లోని యశోద దవాఖానలో బ్రిడ్జ్‌ ది గ్యాప్స్‌ 2.0 నేషనల్‌ కాన్ఫరెన్స్‌, లైవ్‌ వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీర్ణ సంబంధిత రుగ్మతలు, కాలేయ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రతి ఐదుగురు పెద్దల్లో ఒకరు వీటి బారిన పడుతున్నారన్నారు. యేటా మరణాల శాతం కూడా 3.17 శాతానికి చేరుకుందన్నారు. సమావేశంలో తీవ్రమైన జీర్ణశయాంతర రక్తస్రావం, పేగు అడ్డంకులు, తీవ్రమైన పేగు అడ్డంకులు, కాలేయ వైఫల్యం, ప్యాంక్రియాటైటీస్‌, ప్యాటీలివర్‌, వైరల్‌ హైపటైటీస్‌, సిర్రోసిస్‌, లివర్‌ ఫెల్యూర్‌ వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 500లకు పైగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు, డాక్టర్లు నవీన్‌ పోలవరపు, సంతోష్‌ ఎనగంటి, కె.ఎస్‌ సోమశేఖర్‌రావు, గోపి శ్రీకాంత్‌, శరత్‌ చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఎంతో అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. సోమవారం మొదటి బతుకమ్మ, బుధవారం పెద్దల అమావాస్య, 8వ తేదీన అట్ల బతుకమ్మ, 9వ తేదీన విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. విజయదశమి రోజు కూకట్‌పల్లి రామాలయం వద్ద సాయంత్రం 5:30 గంటలకు జమ్మి పూజ, రంగధాముని చెరువు వద్ద విద్యుత్‌ కాంతుల వెలుగులతో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు

జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌

కూకట్‌పల్లి: జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు జోనల్‌ కమీషనర్‌ అపూర్వ చౌహాన్‌ ఆదివారం తెలిపారు. సుమారు 3200 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారందరికీ ఉపయోగపడేలా 9 ప్రాంతాల్లో ఉచిత వైద్య క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌లో ఉదయం 11 గంటలకు ఈ వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం ప్రారంభించనున్నామన్నారు. ఉదయం 12 గంటలకు ఈఎస్‌ఐ వారిచే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల్లో 80 శాతం మంది మహిళలే కావడంతో గైనకాలజీ వైద్య పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఎన్‌ఐఎన్‌ ఇనిస్టిట్యూట్‌ నుంచి ప్రొఫెసర్లు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు.

బతుకమ్మ కుంట పరిశీలన



బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా వివేకానందనగర్‌ డివిజన్‌లోని బతుకమ్మ కుంటలను కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవసరమైన చోట్ల లైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ గురువారెడ్డి, భద్రయ్య, తులసీదాస్‌, నాయకులు ఆంజనేయులు, జగదీష్‌ గౌడ్‌, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌, కొండల్‌రావు, శ్రీనివాస్‌ సాగర్‌, రవీందర్‌ రావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

శివారు రహదారులు..నరకానికి నకళ్లు!

విలీన పంచాయతీలపై పట్టింపులేక ఇబ్బందులు

- మరమ్మతులు లేక.. కొత్త పనులు చేపట్టక అభివృద్ధికి దూరంగా పురపాలికలు
- రూ. కోట్లల్లో పన్నులు వసూలైనా తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారగణం



ఘట్‌కేసర్‌, జవహర్‌నగర్‌లలో అధ్వానంగా తయారైన రహదారులు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లో అధికార యంత్రాంగం పన్నుల వసూళ్లు, అక్రమ లావాదేవీలపై ఉన్న శ్రద్ధను అభివృద్ధి కార్యక్రమాలపై చూపక పోవటంతో పట్టణ ప్రజలు పలు సమస్యలతో తల్లడిల్లుతున్నారు. ఇటీవల శివారుల్లోని 11 పురపాలికల్లో విలీనమైన 40 పంచాయతీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, అధ్వాన స్థితికి చేరిన డ్రైనేజీలు, గుంతల రోడ్ల సమస్యలతో పట్టణాల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. విలీనమైన 40 పంచాయతీలకు మున్సిపల్‌ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులను స్పెషల్‌ ఆఫీసర్లుగా నియమించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. చిన్నపాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతుండగా, పట్టణాలు నరకానికి నకళ్లుగా దర్శమిస్తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా రోజూ కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ. కోట్లల్లో పన్నులు వసూలైనా..

- మేడ్చల్‌ జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 190 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 175 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి.
- వీటిని ప్రణాళికాబద్ధంగా పనులకు వెచ్చించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టక పోవటంతో అభివృద్ధి రెండు అడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అనే చందంగా తయారైంది.

- శివారుల్లో అతిపెద్ద నగర పాలక సంస్థ బోడుప్పల్‌లో రూ. 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా యేటా రూ. 60 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. అయినా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం , కాలుష్యం, చెరువు నీటి దుర్వాసన, పైప్‌లైన్ల లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- మరో మున్సిపల్‌ కార్పొరేషన్‌ పీర్జాదిగూడ కూడా లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలను కలిగి ఉండగా, యేటా పన్నుల ద్వారా రూ. 40 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. అయినా ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. సమస్యలు వీటికే పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన పరిస్థితులు ఉన్న పట్టణాలు నగర శివారు పరిధిలో పలు నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు ఉన్నాయి.
- ఇటీవల శివారుల్లోని 40 గ్రామ పంచాయతీలను కూడా ఏడు పురపాలక సంఘాల్లో ప్రభుత్వం విలీనం చేసింది. ఇక్కడా బోలెడు సమస్యలు దర్శనమిస్తున్నాయి.

శివారుల్లో పట్టణాలివే...

నగర శివారుల్లో బోడుప్పల్‌, ఫీర్జాదిగూడ నిజాంపేట్‌, జవహర్‌నగర్‌, బడంగ్‌పేట్‌, మీర్‌పేట్‌, బండ్లగూడ నగర పాలక సంస్థలు కాగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్‌, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్‌, మేడ్చల్‌, పెద్ద అంబర్‌పేట్‌, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్‌, శంషాబాద్‌, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్‌, మణికొండ, నార్సింగ్‌, ఆదిభట్ల, ఆమనగల్లు మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి.

విలీన జీపీల్లోనూ అదే పరిస్థితి...

ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన 40 గ్రామ పంచాయతీల్లో కూడా సమస్యలు పేరుకుపోయాయి. స్పెషల్‌ ఆఫీసర్లకు తాము ఎదుర్కొంటున్న బాధలు చెబుతామనుకుంటే.. ఇప్పటి వరకు తమ ప్రాంతాలకు కన్నెత్తి కూడా చూడలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలికల్లో విలీనమైన 40 పంచాయతీలకు తాత్కాలికంగా ప్రభుత్వం స్పెషల్‌ ఆఫీసర్లను నియమించింది.

స్పెషల్‌ ఆఫీసర్లు వీరే...

మేడ్చల్‌, దమ్మాయిగూడ, నాగారం పురపాలక సంఘాల్లో విలీనమై 10 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ బి.శ్రీనివాస్‌రావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పోచారం పురపాలికలో కలిసిన 5 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ కె.నారాయణరావు వ్యవహరిస్తున్నారు. ఘట్‌కేసర్‌ పురపాలికలో విలీనమైన 6 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీపాదరామేశ్వర్‌ బాధ్యతలు చేపట్టారు. గుండ్లపోచంపల్లి పురపాలికలో విలీనమైన 2 జీపీలకు కాగా స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ బి.సంధ్య, తూంకుంట పురపాలికలో కలిసిన 3 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ ఏడీ జ్యోత్స్న, పెద్దఅంబర్‌పేట పురపాలికలో కలిసిన 4 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీపాదరామేశ్వర్‌ నియమితులయ్యారు. శంషాబాద్‌, తుక్కుగూడ, నార్సింగి పురపాలికల్లో విలీనమైన 8 జీపీలకు స్పెషల్‌ ఆఫీసర్‌గా మున్సిపల్‌ శాఖ జేడీ శ్రీధర్‌ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.